# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాదిగారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

To be wronged is nothing unless you continue to remember it.
--- Confucius

**గత సంచికని చదివాక కొందరు** వెలిబుచ్చిన అభిప్రాయాల్లో ముఖ్యమైనవి. మొదటిది 'శ్రీ వీరేంద్రనాథ్ కథ ఇటీవల స్వాతి వీక్లీలో వచ్చింది. మరి బలరాం ఆయన రచనలని వేసుకోరని ఎలా రాసారు?' అని. శ్రీ వీరేంద్రనాథ్ కూడా ఇదే అభిప్రాయాన్ని కౌముదికి వెలిబుచ్చారు. బలరాంగారు 1985 - 86 ప్రాంతంలో నాతో చెప్పిన మాటలు అవి. దాదాపు పాతికేళ్ళ తర్వాత ఇటీవల వేమూరి బలరాంగారు తన అభిప్రాయాన్ని మార్చుకున్నారని ఆ కథని ప్రచురించడం ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. మనమంతా అనేక విషయాల్లో మన అభిప్రాయాలను త్వరగానో, ఆలస్యంగానో మార్చుకుంటూనే ఉంటాం. బలరాంగారి మీద నా అలక చాలా కాలం కొనసాగి అకస్మాత్తుగా మాయం అవడం అందుకు ఉదాహరణగా చెప్పచ్చు. ఓ మంచి రచయిత ఓ మంచి పత్రికలో రాయడం పాఠకులకి మేలు చేసే ఆహ్వానించదగ్గ విషయం.

రెండోది బలరాం గారిని పొగడటానికి కారణం, తిరిగి స్వాతి వీక్లీలో బలరాంగారు నా రచనలని ఆహ్వానిస్తారు అని కదా అనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేశారు. నా రచనలు స్వాతిలో రావడానికి ఇది సరైన మార్గంగా నేను భావించడంలేదు.

ఐనా ఓ వ్యక్తిలో నిజంగా ఉన్న సద్గుణాలని చెప్పడం పొగడ్త కింద వస్తుందని నేను అనుకోను. లేనివి ఆపాదించి చెపితేనే అది పొగడ్త అవుతుంది. శ్రీ బలరాం కొన్ని విషయాల్లో ఎంతటి ఉన్నతుడో తెలియచేసే తాజా సంఘటన ఒకటి చెపుతాను. మే పన్నెండు ఉదయం శ్రీ ఆదివిష్ణు ఫోన్ చేసి శ్రీ బలరాం తనకి స్వప్న మాసపత్రికని పంపారని, అందులో నేను తన గురించి రాసినది చదివి ఆనందించానని, ఆ పేజీలో బలరాం గారు గుర్తుగా ఫ్లాగ్‌ని పెట్టి పంపారని ఎంతో ఉత్సాహంగా చెప్పారు. అసలు ఆదివిష్ణుకి దాన్ని పంపాలన్న ఆలోచనే నాకు రాలేదు. ఏనాడో రాసి నేడు తనకి అవసరం లేని పాత రచయితకి దీన్ని పంపకపోయినా బలరాంగారికి వచ్చే నష్టంలేదు. పంపితే వచ్చే లాభం, ఓ పాత రచయితని లేదా మిత్రుడ్ని సంతోష పెట్టాలనే ఔన్నత్యం అని నేను అనుకుంటున్నాను. ఒక్కటి మాత్రం నిజం. ఓ తెలుగువాడు ఇంకో తెలుగువాడిని ఎన్నడూ ఊరికే చంకకి ఎక్కించుకోడు. అలా జరిగిందంటే ఆ వ్యక్తి అందరికీ ఆమోదయోగ్యమైన విశిష్టమైన వ్యక్తి అయి ఉండాలి. శ్రీ వేమూరి బలరాం పాఠకుల దృష్టిలో సరైన రీతిలో చక్కటి వీక్లీని తెచ్చే అలాంటి విశిష్టమైన వ్యక్తి. దీన్ని పొగడ్తంటే నేనేం చెప్పలేను.

మూడోది. ఓ పాఠకుడు 'ఈ మందు పార్టీల గొడవ దేనికి?'అని కౌముదిలో ఓ ఉత్తరం రాసారు. ఇందులో దాయాల్సిన అవసరం నాకేమీ కనిపించడంలేదు. వారు తాగి గొడవ చేసారని రాస్తే తప్పు అవచ్చు. ఒకప్పుడు సిగరెట్, మందు తాగడం టేబూగా ఉండేది కాని ఈ కాలంలో మందు తాగినవాడు చెడ్డవాడు అనే అభిప్రాయం పూర్తిగా తొలిగిపోయింది. పబ్లిక్ ఫిగర్స్ గురించి ప్రజలకి తెలుసుకునే హక్కు ఉందనే నేను భావిస్తున్నాను. రేపు ఎవరైనా నా వ్యక్తిగత జీవిత గురించి రాసినా నేను అభ్యంతరం చెప్పను. నిజాలు రాయాలి అన్నది ఒక్క ఆదర్శాన్ని పాటిస్తే చాలు.

●●●

### శ్రీ నండూరి రామ్మోహనరావు

ఆనాటి ఎడిటర్స్‌లో నాకు పరిచయం ఉన్న మరో ఎడిటర్, ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ శ్రీ నండూరి రామ్మోహన్ రావు. కాకపోతే చాలా స్వల్పం. ఆయన సర్కిల్ చిన్నదిగా ఉండేది. బందరు రోడ్డులో ఆంధ్రజ్యోతి ఆఫీసు ఉండేది. నేను ఆ దినపత్రికకి చాలాకాలం రాయలేదు. శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ నన్ను 1985 లో ఓసారి నండూరిగారి గదికి తీసుకెళ్ళి పరిచయం చేసారు. ఆయన అంటే ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకులు శ్రీ కె.ఎల్.ఎన్.ప్రసాద్‌గారికి బాగా గౌరవం అని, తన విల్లులో శ్రీ ప్రసాద్ తన తదనంతరం

కూడా నండూరిగారినే రిటైర్ మెంట్ వయసు దాటినా ఆయన స్వచ్ఛందంగా పదివి నుంచి తప్పుకునే దాకా ఎడిటర్‌గా కొనసాగించాలని రాసారని విన్నాను. దీన్లో నిజం ఉన్నా, లేకపోయినా శ్రీ కె.ఎల్.ఎన్.ప్రసాద్‌కి నండూరి రామ్మోహనరావుగారి సమర్ధతమీద గల విశ్వాసాన్ని ఇది ప్రచారంలోకి రావడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆయన్ని మేధావిగా సాటి సంపాదకులు గౌరవించేవారు. రచయితలందరికీ కూడా ఆయన పెద్దమనిషి అనే సదభిప్రాయం ఉండేది.


శ్రీ నండూరి రామ్మోహనరావు

ఆయన గది బయట ఎర్ర లైటు వెలుగుతూంటే ఎవరూ ఆ గదిలోకి వెళ్ళి నండూరిగారి ఏకాంతాన్ని, ఏకాగ్రతని భంగపరచకూడదనే నియమాన్ని అంతా పాటించేవారు. ఆయన దినపత్రికకి ఎడిటోరియల్ రాస్తున్నప్పుడు ఆ ఎర్రలైటుని వెలిగించేవారు.

ఆంధ్రజ్యోతిలో 1974లో నా నవల 'రేపటి కొడుకు' సీరియల్‌గా వచ్చాక అది పుస్తకంగా వచ్చింది. పబ్లిషర్ నవభారత్ ప్రకాశరావుగారు నాకు పది కాంప్లిమెంటరీ కాపీలని పోస్టులో పంపారు. అందులో ఒకటి నండూరి రామ్మోహనరావు గారికి రిజిస్టర్డ్ బుక్ పోస్టులో పంపాను. ఐతే అది అందినట్లు ఆయన్నించి నాకు జవాబు రాలేదు.

రచయిత శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావుని నేను విజయవాడ వెళ్ళినప్పుడు కలుస్తూండేవాడిని. వారి క్లినిక్ సత్యన్నారాయణపురం రైల్వే గేటు. ఇవతల ఎడం వైపు ఓ బిల్డింగులో ఉండేది. (ఇప్పుడా గేటూ లేదు. పట్టాలూ లేవు. రైలు పట్టాలు తీసేసి రోడ్డు వేసేసారు. ఆయన క్లినిక్ నడిపిన భవంతి మాత్రం ఉంది) శ్రీ కొమ్మూరి, నండూరిగారు మంచి మిత్రులు, సమకాలీనులు. కొమ్మూరిగారు ఒకటి రెండు సార్లు చెప్పారు, బాపు, రమణ, నవభారత్ ప్రకాశరావు, కొమ్మూరిగారు పార్టీలో కూర్చునేవారని, ఓసారి కొమ్మూరిగారి తోటలో పున్నమి వెన్నెల్లో పార్టీ చేసుకున్నామని చెప్పారు.

రెండోసారి ఆయన్ని విజయవాడలోని మా ఇంట్లో చూసాను. ఆగస్ట్ 17, 1987న విజయవాడలోని మా స్వగృహంలో మా నాన్నగారు శ్రీ మల్లాది దక్షిణామూర్తి పోయారు. ఆ సంగతి ఆలిండియా రేడియో వార్తల్లో చెప్పారు. నా తండ్రిగా కాక, జ్యోతిషపండితుండిగా ఆయనకి ఉన్న గుర్తింపుతో ఆ వార్త వెలువడింది. ఆ వార్త విని గోదావరి జిల్లా నుంచి మా జ్ఞాతులు వచ్చే అవకాశం కలిగింది.

ఆ రోజు శ్రీ తుర్లపాటి కుటుంబరావుతో కలిసి శ్రీ నండూరిగారు మా నాన్నగారి శవాన్ని చూడటానికి వచ్చారు. నాతో శ్రీ తుర్లపాటి గారు తక్షణం అన్న మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. అవి విని నివ్వెరపోయాను.

"మల్లాది వెంకటకృష్ణమూర్తి తండ్రిగా ఆయన్ని చూడటానికి రాలేదు. మీ నాన్నగారు నా ఫ్రెండ్ కాబట్టి వచ్చాను."

నా తండ్రిగా నా మీద గౌరవంతో వారు మా నాన్నగారి శవాన్ని చూడటానికి వచ్చారని నేను గర్వపడతాననుకుని, అందుకు అవకాశం ఇవ్వకుండా ఆ మాటలు ఆయన నాకు చెప్పారని అనిపించింది.

1980లలో యండమూరి వీరేంద్రనాథ్ పుణ్యమా అని ఆయన తులసీదళం ద్వారా, ఆయన ఎడిటర్స్‌తో గడుసుగా డీల్ చేసే పద్ధతి ద్వారా రచయితలు తమకన్నా తక్కువ స్థాయికి చెందినవారు అనే దృక్పథం ఉన్న చాలామంది ఎడిటర్స్ క్రమంగా మారారు. వీరేంద్రనాథ్‌ని, నన్ను ఎడిటర్స్ సర్క్యులేషన్ పెంచే సత్తాగల కమర్షియల్ రచయితలుగా గౌరవించడం వీరేంద్రనాథ్ కృషివల్లే జరిగిందన్నది నిర్వివాదాంశం. అంతకు మునుపు తనకంటూ అభిమాన పాఠకులని ఏర్పరచుకున్న రచయిత్రిగా ఒక్క యద్దనపూడి సులోచనారాణి గారికే అది దక్కింది.

1987 నుంచి వారపత్రికల్లోనే కాక దినపత్రికల్లో కూడా డైలీ సీరియల్స్‌గా కమర్షియల్ సీరియల్స్ వేయడానికి ఆంధ్రజ్యోతి దిన పత్రికే శ్రీకారం చుట్టింది. నేను కలిసిన చాలామంది దినపత్రిక సంపాదకులకి డైలీ సీరియల్స్ కోసం అరపేజీ స్పేస్ ఇవ్వడం ఆ రోజుల్లో ఇష్టం ఉండేది కాదు. వార్తలని చక్కగా ప్రజంట్ చేయడం, సమర్ధవంతమైన ఎడిటోరియల్స్‌ని రాయడం ద్వారా సర్క్యులేషన్ పెరుగుతుందనే అభిప్రాయంలో ఉండేవారు. అంతే తప్ప డైలీ సీరియల్స్ వల్ల అని వారు నమ్మేవారు కారు. నండూరి వారు ఇందుకు మినహాయింపు కాదు. సీరియల్‌ని సంపాదకులు కాక అన్ని సందర్భాల్లో దాన్ని చదివిన మరొకరు - ప్రధానంగా లిటరరీ ఆసక్తి గల ఉపసంపాదకులు ఎన్నిక చేసేవారు. పావు పేజీ లేదా ఇంకా తక్కువ అందుకు కేటాయించేవారు. ఐతే కమర్షియల్ నవల ఆరంభం అయ్యాక వీరేంద్రనాథ్, నా సీరియల్స్‌ని సంపాదకులు వ్యతిరేకించినా మేనేజ్‌మెంట్ కోరి వేసేది. ఆంధ్రజ్యోతి దినపత్రిక హైదరాబాద్‌కి 1987లో షిఫ్ట్ అయింది. ఈ నేపథ్యంలో 1987 ప్రధమార్ధంలో హైదరాబాద్ నుంచే రావడం మొదలైంది. మొదటి సంచిక నుంచే 'ఎయిర్ హోస్టెస్' అనే నా సీరియల్ అందులో డైలీ సీరియల్‌గా వెలవడింది. దాని తర్వాత వీరేంద్రనాథ్ సీరియల్ 'నల్లంచు తెల్ల చీర' వచ్చింది. ఆ తర్వాత మళ్ళీ నా సీరియల్‌ని కోరితే 'హిట్ లిస్ట్' అనే డైలీ సీరియల్‌ని జ్యోతి డైలీలో ఆరంభించాను. అక్టోబర్ 31, 1984న ఇందిరాగాంధీ హత్య కేసులో మరణశిక్ష పడ్డ సత్వంత్ సింగ్, బల్బీర్ సింగ్, కేహార్ సింగ్‌లు సుప్రీం కోర్టుకి వెళ్ళారు. ఆ సమయంలోనే వారి విచారణ జరుగుతోంది. ఖలిస్థాన్ సమస్య ఇంకా సమసిపోని రోజులవి.






పాఠకులకు
ముఖ్య గమనిక

'హిట్ లిస్ట్' నవలలోని పాత్రలు, సన్నివేశాలు కేవలం కల్పితం మాత్రమే. పంజాబ్ ప్రస్తుత పరిస్థితిని నేపథ్యంగా మాత్రమే తీసుకుని ఈ నవల వ్రాయబడింది. ఏ వర్గం వారిని కించపరచడానికిగాని, ఉగ్రవాదాన్ని సమర్థించడానికిగాని ఉద్దేశించి వ్రాసినది కాదు. ఈ విషయంలో ఎవరికైనా అపోహలు కలిగితే నవల చివరి వరకు చదివిన పక్షంలో ఇది సాధారణ అపరాధ పరిశోధక నవల మాత్రమేనని విదితమవుతుంది.

—రచయిత

పంజాబ్ ఉగ్రవాదం నేపథ్యంలో సాగే ఆ సీరియల్ మే 1, 1988న మొదలైంది. 'రగులుతున్న పంజాబ్ సమస్యని ప్రత్యక్షరం చేస్తున్న ప్రత్యేక నవల' 'ఉగ్రవాదపు ఉరుములూ, పిడివాదపు పిడుగులు' అన్న కేప్షన్లతో ఆ సీరియల్ ఆరంభం అయింది. మూడు వారాల తర్వాత ఓ రోజు పురాణంగారు మా ఇంటికి ఫోన్ చేసి 'హిట్ లిస్ట్' సీరియల్‌ని ఆపేయాలని లీగల్ నోటీసు వచ్చిందని, ఓసారి విజయవాడ వచ్చి కలవమని కోరితే నేను వెంటనే విజయవాడ వెళ్ళాను. ఆయన నండూరి రామ్మోహన్ రావుగారి ఆఫీసు గదిలోకి నన్ను తీసుకెళ్ళారు. ఆ నోటీస్‌ని ఆయన చూపించారు. విజయవాడ గవర్నర్ పేట మసీదు రోడ్ లోంచి ఎవరో ఇచ్చిన నోటీసది. అందులో అభ్యంతరకరమైన విషయంగా పేర్కొన్నవి, టెర్రరిజాన్ని నా సీరియల్ ప్రోత్సహిస్తోందని, నేను అనేక ఆధునిక ఆయుధాల గురించి విశేషంగా రాస్తున్నానని, అది దేశ భద్రతకి ముప్పు తెస్తుంది కాబట్టి వెంటనే ఆపేయాలని.

"ఇందులో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేది ఏదీ లేదు. వారు భారతదేశంలో భాగం కాబట్టి రచయితగా వారిని కల్పిత పాత్రలుగా వాడుకుని నవల రాయడం తప్పుకాదు. అందులోని ఆయుధాల సమాచారం అంతా ఇండియాలో లభ్యం అయ్యే అనేక దేశ, విదేశ ఆంగ్ల పత్రికలనుంచి తీసుకున్నాను తప్ప కొత్తదేం కాదు. ఆ నోటీస్‌లో పేర్లొన్న విషయంలో పసలేదు. కాబట్టి మనం దీన్ని ఆపక్కర్లేదు." నా అభిప్రాయం చెప్పాను.

కొంత చర్చ జరిగింది. నవలని ఆపాల్సిన అవసరం లేదని నేను వాదించాను.

"ఈ నోటీస్ కాపీని విజయవాడ సిబిఐ ఆఫీసుకి కూడా పంపారు. ఫెరా చట్టం ప్రకారం ఎవర్నయినా కేసు కోర్టులో నమోదవకుండా, విచారణ లేకుండా మూసేసే అధికారం వారికి ఉంది. నన్ను, మిమ్మల్ని, జగదీష్ ప్రసాద్‌ని (అప్పటికి శ్రీ కె.ఎల్.ఎన్.ప్రసాద్ పోయారు) ఆ చట్టం కింద చాలా కాలం మూసేయచ్చు."

"ఓసారి వాళ్ళనే ఆ విషయం అడుగుదాం." నేను సూచించాను.

ఆయన వెంటనే పోలీస్ కమీషనర్‌తో మాట్లాడారు. ఇద్దరం రిక్షాలో పోలీస్ కమీషనర్ ఇంటికి వెళుతూంటే అప్పుడు నాకు అనిపించింది, నేను తప్పు చేస్తున్నానని. అంత పెద్దమనిషిని ఏసి గదిలోంచి మే నెల మండుటెండలో బయటకి తీసుకురావడం తప్పనిపించింది. నేను వెంటనే శ్రీ నండూరికి క్షమాపణలు చెప్పాను. ఆయన మృదువుగా నవ్వారు కాని ఇంకేం మాట్లాడలేదు. అప్పటి పోలీస్ కమీషనర్ శ్రీ దినేష్ రెడ్డి శ్రీ నండూరికి పరిచయం. నన్ను శ్రీ నండూరి వారికి పరిచయం చేసారు. తర్వాత నోటీస్‌ని చూపించారు. అది చదివి దినేష్ రెడ్డిచెప్పారు.

"నేను హిట్ లిస్ట్‌ని చదువుతున్నాను. నాకు అందులో అభ్యంతరకరమైనదేదీ కనపడలేదు. ఉండి ఉంటే నా పోలీస్ బుర్ర వెంటనే పట్టేసేది. లేదా మా సిబ్బంది అది నా దృష్టికి తెచ్చేవారు."

కొంతసేపు చర్చ జరిగాక నండూరిగారికి అది క్లోజ్ చెయ్యాలని ఉందని గ్రహించినట్లున్నారు.

"ఒకవేళ సిబిఐ వాళ్ళు దీని మీద ఏదైనా చేయదలచుకుంటే మాత్రం ఎవరూ మిమ్మల్ని కాపాడలేరు. చాలా కాలం జైల్లో విచారణ లేకుండా ఉండాలి. కాబట్టి ఆ సీరియల్ ఆపేస్తే వచ్చే నష్టాన్ని, ఈ నష్టంతో పోల్చుకుని చూస్తే మిమ్మల్ని వాళ్ళు మూసేసే కంటే, మీరు ఆ సీరియల్‌ని ఆపేయడం మంచిది." శ్రీ దినేష్ రెడ్డి సలహా ఇచ్చారు.

ఇద్దరం మళ్ళీ రిక్షాలో వారి ఆఫీసుకి చేరుకున్నాం. దారిలో శ్రీ నండూరిని అడిగాను స్రవంతి వీక్లీ ఎడిటర్‌గా పనిచేస్తున్న కాలంలో నేను కోర్టులకి వెళ్ళాల్సి వస్తుందని, కాబట్టే ఆ బాధ్యతని విరమించుకోమని నాకు కబురు పంపారా అని. అవునని చెపుతూ ఇలా చెప్పారు.

"ఎడిటర్ మీద ఎవరైనా ఏ కోర్టులోనైనా కేసు వేయడం తేలిక. ప్రతీ వాయిదాకి మన ఊరి నుంచి ఆ ఊరికి వెళ్ళి కేసుకి హాజరై రావడం తలనొప్పితో కూడుకున్న పని. దినపత్రిక ఎడిటర్‌గా నాకు ఇది అనుభవమే. ఇప్పుడు బందరులో నడిచే ఓ కేసుకి నేను హాజరవుతున్నాను. ఆఫీసు వాళ్ళు కారిస్తారు. కారులో వెళ్ళిరావడమే. చివరికి మనమే గెలుస్తాం. కాని నానా యాతన పడాలి."

కోర్టుకి వెళ్ళడం ఆయనకి నామోషీ అని నేను భావించాను. నా ఊహ తప్పు కావచ్చు కూడా. ఆఫీసుకి వెళ్ళాక పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు, నండూరి గారు, జగదీష్ ప్రసాద్‌లు చర్చించుకుంటే నేను మౌనంగా ఉండిపోయాను. ఆ సీరియల్ ఆపడం నాకు ఎంత మాత్రం ఇష్టంలేదు. 'దీనికి లొంగితే రేపు ఇంకో నోటీసు ఇచ్చి ఏ సీరియల్ నైనా వాళ్ళు ఆపేయచ్చు అన్న ఆలోచన ఒకటి, ఎవడో ముక్కు మొహం తెలీనివాడు ఇచ్చిన నోటీస్‌కి భయపడటం, అదీ తప్పు జరగకుండా భయపడటం ఏమిటి' అని నా మనసులో ఉన్న ఆలోచనలు.

"మల్లాది గారూ. దాన్ని ఇవాల్టితో క్లోజ్ చేసేద్దాం." నండూరి గారు చివరికి చెప్పారు.

"అలాగే సార్." నేను ఒప్పుకున్నాను.

వాళ్ళ దగ్గరున్న నాలుగైదు రోజుల స్క్రిప్ట్‌ని వెనక్కి తీసుకుని నేను తిరిగి హైదరాబాద్ వచ్చేసాను. ఆ తర్వాత ఎన్నడూ ఆ సీరియల్‌ని పూర్తి చేసి పుస్తకం వేయాలన్న ఆలోచన నాకు రాలేదు. 1993లో అనుకుంటా ఎవరో పాఠకుడు, దాన్ని పూర్తిచేసి పుస్తకంగా ఎందుకు వేయలేదని నాకు ఉత్తరం రాసారు. అచ్చయిన హిట్ లిస్ట్ మొత్తం సీరియల్ నాకు పంపాడు. ఆ పాఠకుడికి క్షమాపణలు, నాకు అతని ఊరు, పేరు గుర్తులేదు. కాని ఎప్పుడూ చేతిలో సీరియల్స్‌తో పని ఉంటూండటంతో దాన్ని పూర్తిచేయడానికి సరైన సమయం చిక్కలేదు అనే కంటే బలమైన సంకల్పం కలగలేదు అని చెప్పడమే సబబు. ఇటీవలే దాన్ని, నవల సినాప్సిస్‌తో సహా విజయనగరంలోని రచయిత శ్రీ మంజరికి పంపాను. పోలీస్ శాఖలో పనిచేసిన, క్రైం నవలలు రాసిన అనుభవం గలవారు దాన్ని త్వరలో పూర్తిచేయచ్చు.

కె.ఎల్.ఎన్ ప్రసాద్ గారి విల్లు ప్రకారం శ్రీ నండూరి గారు తమంతట తాముగా రిటైరయ్యే దాకా ఎడిటర్‌గా కొనసాగాలి. ఐనా ఆయన్ని వారబ్బాయి జగదీష్ ప్రసాద్ తీసేసారని, ఆయన హైద్రాబాద్ వచ్చి ఉంటున్నారని కొంతకాలం తర్వాత విన్నాను. ఓ రోజు రవీంద్ర భారతి మెట్ల మీద ఒకాయన నా దగ్గరకి వచ్చి తేరిపార చూసి 'రంగేసుకున్నారా? వెంట్రుకలు ఇంకా తెల్లబడలేదేమిటా అని చూస్తున్నా' అన్నారు. ఆయన్ని నండూరి రామ్మోహన్ రావు గారిగా పోలుకున్నాను. అదే ఆయన్ని ఆఖరిసారి చూడటం.

●●●

## శ్రీ రామోజీ రావు



రామోజీరావు గారిని నేను రచయితగా మూడుసార్లు కలిసాను. మొదటిసారి 1970లలో సోమాజీగుడాలోని ఈనాడు ఆఫీసులో, అప్పట్లో రామోజీరావు కార్యాలయం రెండో అంతస్థులోని ఓ మూల గదిలో ఉండేది. ఇటు మూల రామోజీరావు గారిది. ఎదురుగా అటు చివర శ్రీ చలసాని ప్రసాదరావు సీట్. ఓ సాయంత్రం నేను ప్రసాదరావు గారి దగ్గరకి వెళితే అక్కడ రచయితలు శ్రీధర, పాలకోడేటి సత్యనారాయణరావు ఉన్నారు. ప్రసాదరావు నాతో చెప్పారు.

"ఈ రోజు రామోజీరావుగారి పుట్టినరోజు. వీళ్ళిద్దరూ అభినందనలు చెప్పడానికి వెళుతున్నారు. మీరూ వెళ్ళండి."

"నాకు వారితో పరిచయం లేదు. వెళ్ళను" అయిష్టంగా చెప్పాను.

"వెళ్ళండి. ఫర్వాలేదు. మల్లాది వెంకటకృష్ణమూర్తి అని చెప్పకండి. 'ఆదివారం మూర్తి' అని చెప్పండి. గుర్తుపడతారు."

కాదనలేక నేను వారిద్దరితో రామోజీరావు గదిలోకి వెళ్ళాను. ఎప్పటిలా తెల్లబట్టల్లో ఉన్నారాయన. వాళ్ళు ఇద్దరూ అన్న మాటలే గొణిగేను. నా పేరు అడిగితే 'ఆదివారం మూర్తి' అని చెప్పి ఐదంటే ఐదే క్షణాల్లో ముగ్గురం బయటపడ్డాం. అంతకు మించి ఆయన మాకు టైం ఇవ్వలేదు. ఆదివారం ఈనాడులో రాస్తాను కాబట్టి, నెలనెలా రామోజీరావు గారే అప్పట్లో చెక్కుల మీద సంతకం చేసేవారు కాబట్టి రామోజీరావుతో చలసాని నా గురించి సందర్భం వచ్చినప్పుడు 'ఆదివారం మూర్తి' అని చెప్పేవారు.

రెండోసారి కూడా చలసానిగారే బలవంతంగా పంపించారు. అప్పుడు సితార సినిమా వారపత్రిక మొదలవబోతోంది. శ్రీ రామోజీరావు తన గదిలో కాక మామూలు సిబ్బంది కూర్చునే చోట కూర్చుని ఓ రోజు దాని ఎడిటోరియల్ వ్యవహారాలు చూస్తున్నారు. అప్పటికే పాలకోడేటి, ఇంకా చాలామంది ఆయన్ని కలుస్తున్నారు. ఎవరేం రాయాలో ఆయన చెపుతున్నారు.

"మీరు వెళితే మీకూ ఏదైనా శీర్షిక ఇచ్చి రాయమనచ్చు. వెళ్ళండి." నా మీద గల ప్రేమతో చలసాని ప్రోత్సహించారు.

రెండోసారి కూడా నాకు అలా వెళ్ళడం ఇష్టం లేకపోయినా మళ్ళీ చలసాని మాటని తీసేయలేక, వారి పక్క కేబిన్‌లో కూర్చున్న రామోజీరావు గారి దగ్గరకి వెళ్ళి నమస్కారం చేసి 'ఆదివారం మూర్తి'ని అని పరిచయం చేసుకున్నాను.

"మాకేం రాస్తారు?" ఆయన వెంటనే అడిగారు.

నేను ఫలానాది రాయాలని ప్రిపేర్ అయి లేను కాబట్టి 'మీరు ఇచ్చే ఇంగ్లీష్ వ్యాసాలని అనువదిస్తాను' అని జవాబు చెప్పాను. 'సరే. వెళ్ళిరండి' వెంటనే ఆయన చెప్పారు.

ఏం రాయాలో ఆలోచించుకోకుండా అంత బ్లేంక్‌గా అంత పెద్దాయన దగ్గరకి ఎలా వెళ్ళానా అని నాకు ఇది గుర్తొచ్చినప్పుడల్లా నవ్వొస్తూంటుంది. కొద్దిగా ఆలోచించుకుని వెళితే 'ఫలానాది రాస్తాను' అని చెప్పగలిగి ఉండేవాడిని.

మూడోసారి కూడా శ్రీ రామోజీరావుని ఈనాడు ఆఫీసులోని వారి కార్యాలయంలో కలిసాను.

ఉషాకిరణ్ మూవీస్‌కి కామెడీ కథని వెదుకుతున్నారని నా దగ్గర ఏదైనా కథ ఉంటే వారికి చెప్పమని శ్రీ చలసాని ప్రసాదరావు ఓ రోజు నాతో చెప్పారు. అప్పట్లో మయూరి వీక్లీకి సీరియల్‌గా రాయడానికి ఓ కామెడి కథని సిద్ధం చేసుకున్నాను. ఒకవేళ కథ నచ్చి తీసుకున్నాక నేను సీరియల్‌గా రాసుకోవచ్చంటే చెపుతానని చెప్పాను. ఆయన కనుక్కుని అందుకు అభ్యంతరం లేదని చెప్పారు. మొదటి నుంచి నేను సినిమాకి కథ ఇవ్వడం కన్నా, పత్రికలకి సీరియల్స్ రాయడమే వ్యాపకంగా పెట్టుకున్నాను. శ్రీ చలసానిగారి టేబుల్ పక్కనే మరో టేబుల్ ముందు కూర్చునే లలిత కుమారిని పరిచయం చేసారు.

"ఈమెని ఓల్గా అని కూడా అంటారు" ప్రసాదరావు చెప్పారు.

ఆమె ఉషాకిరణ్ మూవీస్ కథా విభాగానికి హెడ్‌గా పని చేసేది. ఉషాకిరణ్ మూవీస్‌కి వచ్చే కథని ఆమె సరే అంటేనే రామోజీరావు గారి దగ్గరకి అది చేరేది.

ఆమెకి నేను అనుకున్న కథ చెప్పాను.

"నాకు బావుంది. దీన్ని పైవాళ్ళకి చెప్పి, వాళ్ళకీ నచ్చితే ఓసారి రామోజీరావు గారికి మీరు మళ్ళీ ఈ కథని చెప్పాల్సి ఉంటుంది." ఓల్గా వెంటనే తన నిర్ణయాన్ని చెప్పారు.

కొద్దిరోజుల తర్వాత ఓల్గా ఫోన్ చేసి రామోజీరావుగారికి ఫలానా రోజు, ఫలానా టైంకి కథ చెప్పగలరా అని అడిగారు. నేను సరే అన్నాను.

ఆ రోజు సాయంత్రం ఈనాడు ఆఫీస్‌లోని రామోజీరావుగారి గదిలోకి వెళ్ళాను. ఈ గది ఇదివరకటి గదికి పక్క గది. బహుశా కాన్ఫరెన్స్ గది అయి ఉండచ్చు. ఆ గదిలో శ్రీ రామోజీరావు, ఆయన భార్య, ఉషాకిరణ్ ఇన్‌ఛార్జ్ శ్రీ అట్లూరి రామారావు, ఓల్గా, మరో ఇద్దరు కథ వినడానికి ఉన్నారు. రామారావుగారు నన్ను రామోజీరావుగారికి పరిచయం చేసారు.

నాకు కథలు రాయడం బాగా వచ్చుకాని, చెప్పడం పెద్దగా రాదు. మద్రాస్‌లో నేను కలిసిన యం.డి సుందర్ లాంటి కొందరు తమిళ రచయితలు ప్రతీ పాత్రనీ అభినయిస్తూ తెర మీద రెండు నిమిషాలు కనబడే మొదటి సీన్ని అరగంట సేపు వర్ణించి ఆసక్తిగా చెప్పగలరు. మొదటి సీన్ విన్నాక అడ్వాన్స్ ఇచ్చి వచ్చిన తెలుగు నిర్మాతలు నాకు తెలుసు. మొదటి సీనే ఇంత బావుంటే ఇక తర్వాతి కథ ఎంత బావుంటుందో అనుకునేలా వాళ్ళు ఇంప్రెస్ చేయగలరు. ఆ తర్వాత మిగిలిన కథ విని నచ్చక కొందరు అడ్వాన్స్‌ని వదులుకున్న సందర్భాలు కూడా నాకు తెలుసు.

ముందుగా నాకు కథ చెప్పడం బొత్తిగా రాదన్న సంగతి శ్రీ రామోజీరావుకి చెప్పాను. ఆయన ఏం మాట్లాడలేదు కాని, 'మంచి కథని పసికట్టడానికి అలా చెప్పడమే సరైన పద్ధతి. కథ బాగా చెపితే కాని ఇంప్రెస్ అయ్యేవారు ఇక్కడ ఎవరూ లేరు. ఫర్వాలేదు. మీకు వచ్చినట్లుగా చెప్పండి' అని అట్లూరి రామారావు చెప్పారు.

తర్వాత కథ చెప్పసాగాను. కొంత కథ విన్నాక శ్రీ రామోజీరావు ఒకటి రెండు ప్రశ్నలు వేసారు. 'వీటి జవాబు చివర్లో తెలుస్తుంది. ఇప్పుడే చెప్పను' అని దాదాపు ఇరవై నిమిషాల్లో కథ చెప్పడం ముగించాను. చక్కటి కాఫీ వచ్చింది. తర్వాత శ్రీ అట్లూరి టేబుల్ మీదున్న వక్కపొడి డబ్బాని నా వైపు తోసి తీసుకోమని చెప్పారు. నాకు వక్కపొడి అలవాటు లేదు. అదే చెప్పాను.

"ఇది ప్రత్యేకంగా చేయించింది. ఇలాంటిది మీకు బయట ఎక్కడా దొరకదు. రుచి చూడండి."

రామారావు చెబితే కొంచెం తిన్నాను. అది నిజంగానే రుచిగా ఉంది.

అక్కడ ఎవరూ ఒక్కమాట మాట్లాడలేదు. మర్నాడు మధ్యాహ్నం తనని కలవమని శ్రీ రామారావు చెప్పాక నేను బయటకి వచ్చి, శ్రీ చలసాని సీట్ దగ్గరకి వెళ్ళాను. జరిగింది ఆయన నా నుంచి ఆసక్తిగా తెలుసుకున్నారు.

మర్నాడు మధ్యాహ్నం శ్రీరామారావుని కలిస్తే కథ తమకి నచ్చిందని పదిహేను వేలు పారితోషికం ఇస్తామని చెప్పారు. అది కూడా అన్ని భాషలు కలిపి. కాని అప్పటికే నాకు ఒక్క తెలుగుకే పాతికవేలు ఇస్తున్నారని, అంతకు తగ్గనని చెప్పాను. వారు పెంచలేదు. నేను తగ్గలేదు. తర్వాత ఆ కథ జంధ్యాల దర్శకత్వంలో 'నీకూ నాకు పెళ్ళంట'గా వెలువడింది. ఆ తర్వాత ఎప్పుడో కలిసినప్పుడు ఓల్గా గారు తను ఆ సినిమాని చూసానని నేను చెప్పిన కథ అంత బాగా తీయలేదని కామెంట్ చేసారు. రచయితగా నేను చేసిన తప్పుల్లో ఒకటి ఉషాకిరణ్ లాంటి పెద్ద బేనర్ దగ్గర డబ్బు విషయంలో వారిలా నిక్కచ్చిగా వ్యవహరించడం. దాన్ని వారు తీసుంటే బాగా వచ్చేది. కొసమెరుపు ఏమిటంటే జయకృష్ణ, జంధ్యాల భాగస్వాములుగా తీసిన ఈ సినిమాకి నాకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పారితోషికం ఎగ్గొట్టారు.

ఆ తర్వాత ఓసారి మద్రాస్‌లో చోళా షెరాటన్ హోటల్‌లోని ట్వంటీ ఫోర్ అవర్ కాఫీ షాప్‌కి వెళ్ళినప్పుడు రామోజీరావు గారిని లాంజ్‌లో చూసాను. ఒంటరిగా కూర్చుని ఉన్నారు. కొత్తవారిని పలకరించడం నా స్వభావం కాదు కాబట్టి నేనాయన్ని పలకరించలేదు. ఆయన్ని మూడు సార్లు కలిసినా కొత్తవారు అనే ఇంప్రెషనే నాకు కలిగింది.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

**Click here to share your comments on this story**